క్లుప్తంగా

పూడిక తీతకు భూమి పూజ



వల్లంపేట వద్ద పూడిక తీతకు భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నాతవరం: తాండవ రిజర్వాయరు ప్రధాన కుడి కాలువలో పూడిక తీతకు సోమవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ ఏడాది ఉపాధి హామీ పథకం కింద తాండవ కాలువలో పూడిక తొలగించేందుకు రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పూడిక తీయడం ద్వారా 52 వేల మంది వేతనదారులకు పని కల్పించనున్నారు. ఈ పనులను వల్లంపేట గ్రామ సమీపంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ, తాండవ ప్రాజెక్టు డీసీ మెంబరు పారుపల్లి దాసు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యవానిపాలెంలో పంటలపై అవగాహన



సీజనల్ క్యాలెండర్‌పై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

రావికమతం: కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం మత్స్యవానిపాలెంలో కాలానుగుణ పంటల సాగుపై అవగాహన కల్పించారు. వ్యవసాయ క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా బీఎస్సీ విద్యార్థులు రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏ రుతువులో ఎటువంటి పంటలు వేయాలి, ఏ పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయో వివరించారు. గ్రామంలో సీజనల్ క్యాలెండర్‌ను ఏర్పాటు చేసి, కాలానుగుణ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజ్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఎస్సీ విద్యార్థులు అంకిత, రచన, బిందు మాధవి, మణిదీపిక, చరిష్మా, మేఘన తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం



పదిలో ప్రగతి సాధించిన విద్యార్థులతో ఎంఈవోలు పడాల్‌దాస్, సింహాచలం

చోడవరం రూరల్: విద్యార్థులు ఉత్తమ ప్రతిభలో ఆటు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమని ఎంఈవోలు బి.పడాలదాస్, కె.సింహాచలం అన్నారు. సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. మండలంలోని 16 పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను సైతం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ మండలంలో పది ఫలితాలలో సాధించిన ఉత్తీర్ణత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పదిలో సాధించిన విజయం స్ఫూర్తిగా విద్యార్థులు తమ భవిష్యత్‌లో ఉన్నత విద్యలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు

చోడవరం: వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి పారుదల విభాగం అధికారులను ఎమ్మెల్యే రాజు ఆదేశించారు. చోడవరం పట్టణం కోటవీధి, గండికాలనీ, శివాలయం వీధిలో మూడు చేతి బోర్ల ఏర్పాటుకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఇప్పటికే ఇంటింటి కొళాయి పనులు పూర్తిస్థాయిలో చేసేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ బండి నూకాలమ్మ, ఎంపీటీసీ చిన్న, మాజీ ఎంపీపీ పెదబాబు, సకురు కోటీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

1న మెగా ఉచిత వైద్య శిబిరం

మాడుగుల రూరల్: వచ్చే నెల 1న వీరవల్లి అగ్రహారం శివాలయం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు శ్రీనాథ రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వి.సత్యారావు ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరంలో అనిల్ నీరుకొండ ఆస్పత్రి, మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారని పేర్కొన్నారు. మండలంలో ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఏలేరు, తాండవ కాలువలపై ప్రమాదకరంగా కల్వర్టులు

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

భయపెడుతున్న శిథిల వంతెనలు



ఆర్.వెంకయ్యపాలెం వద్ద కల్వర్టు రక్షణ గోడలు శిథిలమై ప్రమాదకరంగా మారిన కాలువ



జిల్లేడుపూడి రోడ్డులో వంతెన వద్ద ప్రమాదాలు జరగకుండా కర్రలు ఏర్పాటు చేసిన స్థానికులు

నాతవరం: ఏలేరు, తాండవ ప్రధాన కాలువలపై నిర్మించిన వంతెనలు, కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. ఇవి ప్రమాదకర పరిస్థితిలో ఉన్నా అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. మండలంలో 12 పంచాయతీల మధ్యలోంచి ఏలేరు కాలువ ద్వారా విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు నీటిని తరలిస్తున్నారు. ఈకాలువపై మధ్యలో అనేక చోట్ల రోడ్లపై రాకపోకలు సాగించేందుకు వంతెనలు, కల్వర్టులు నిర్మించారు. అదే విధంగా తాండవ ప్రధాన కాలువపై కూడా వంతెనలు, కల్వర్టులు నిర్మాణం చేపట్టారు. రిజర్వాయరు నిర్మాణం సమయంలో తాండవ కాలువపై 1971 నుంచి 1974 మధ్య వంతెనలు నిర్మించారు. అలాగే ఏలేరు కాలువపై 1986–1989 మధ్య కాలంలో వంతెనలు, కల్వర్టులు నిర్మించారు. మండల వ్యాప్తంగా ఏలేరు, తాండవ కాలువలు **ప్రవహించే ప్రాంతాల్లో సుమారుగా 40 నుంచి 50 వరకు వంతెనలు, కల్వర్టులు ఉన్నాయి. అప్పట్లో నిర్మించిన వీటి రక్షణ గోడలు శిథిలమై చాలా చోట్ల** ప్రమాదకరంగా ఉన్నాయి. నర్సీపట్నం, తుని మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుపై ఎ.శరభవరం గ్రామం వద్ద ఏలేరు కాలువపై నిర్మించిన వంతెన శిథిలమైపోయింది. ఇదే రోడ్డులో గాంధీనగరం వద్ద తాండవ కాలువకు నిర్మించిన ఆక్వా డెక్టు శిథిలావస్థకు చేరుకుంది. నీటి ప్రవాహం సమయంతో నీరంతా రోడ్డుపైకి వచ్చేసి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రాంతంలో పలువురు మృతి చెందిన సంఘటనలూ ఉన్నాయి. నాతవరం, జిల్లేడుపూడి, మన్యపురట్ల, నాయుడుపాలెం, లింగంపేట, గునుపూడి, రాజుపేట, అగ్రహారం, పెదగొలుగొండపేట, చమ్మచింత, వెదురుపల్లి, చినగొలుగొండపేట, ఆర్.వెంకయ్యపాలెం, ఉప్పరగూడెం, పి.కె.గూడెం, కొండదర్మవరం గ్రామాల వద్ద తాండవ, ఏలేరు కాలువలపై నిర్మించిన వంతెనలు, కల్వర్టులు ప్రయాణికులను భయపెడుతున్నాయి. పలు చోట్ల తాత్కాలికంగా ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. ఇప్పటికైనా శిథిలమైన వంతెనలకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మేడివాడ హైస్కూల్‌లో సమావేశమైన 2014-15 బ్యాచ్ విద్యార్థులు

రావికమతం: మేడివాడ హైస్కూల్‌లో 2014–15లో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం సమావేశమయ్యారు. అప్పట్లో 100 మంది విద్యార్థులు చదివేవారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వీరంతా పదేళ్ల తర్వాత ఒక్క చోట చేరి సందడి చేశారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మధ్యాహ్నం అంతా కలిసి సహపంక్తి భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. అప్పట్లో పాఠాలు చెప్పిన గురువులు నాగేశ్వరరావు, మహేశ్వరరావు, మహాలక్ష్మినాయుడు, పీఈటీ నాగరాజు, తదితరులను ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆహ్వానించి సత్కరించారు.

ఉత్తమ 'పది' విద్యార్థులకు నగదు పురస్కారాలు



లక్ష్మీపురం పాఠశాలలో లయన్స్‌క్లబ్ సత్కారం

చోడవరం రూరల్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ చోడవరం శాఖ ఆధ్వర్యంలో సోమవారం నగదు పురస్కారాలు అందజేశారు. మండల స్థాయిలో పది పరీక్షలలో ఉత్తమ మార్కులను సాధించిన, ఆయా పాఠశాలల పరిధిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారంతో పాటు జ్ఞాపికలు అందించి సత్కరించారు. సుమారు లక్ష రూపాయల మేర పురస్కారాలు అందచేసినట్టు క్లబ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు నీలం నాగేంద్రబాబు, పసుమర్తి సాంబశివరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం గ్రామ ఉప సర్పంచ్ శిరిసోళ్ళ ఆదిగణపతినాయుడు, ఎంఈవో కె.సింహాచలం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్నాథరావు, క్లబ్ ప్రతినిధులు ముక్కా రమేష్, పూసర్ల శకుంతలరావు, సాయిరాం శ్రీను, నల్లమిల్లి గనిరెడ్డి, బద్రిమహంతి పల్గుణ్, ఉగ్గిన నాగబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

నర్సీపట్నం: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం స్థానిక డిపోకు చెందిన అసోసియేషన్ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. డిపో కార్యదర్శి జి.ఎస్.నారాయణ మాట్లాడుతూ నాలుగేళ్లుగా నిలిపివేసిన అన్ని కేటగిరీల ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థపరంగా వేతనాలు ఇవ్వాలన్నారు. పారదర్శకంగా బదిలీలు చేయాలన్నారు. ఆఫీస్, గ్యారేజ్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలన్నారు. రిలే దీక్షలు రెండు రోజుల పాటు కొనసాగుతాయన్నారు. ఈ దీక్షల్లో వై.ఇ.రావు, కె.రమణ, పి.లక్ష్మణుడు, బి.ఎ.నాయుడు, కె.ఎ.రావు, ఆర్.ఎస్.రాజు, పి.కె.రావు, ఇ.దాసు పాల్గొన్నారు.

రెల్లలపాలేనికి రోడ్డు వేయండి మహాప్రభో



రెల్లలపాలెంలో నిరసన తెలుపుతున్న చిన్నారులు, గ్రామస్తులు

చీడికాడ: తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని మండలంలోని కోనాం శివారు రెల్లలపాలెం గిరిజనులు చిన్నారులతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సీఎం చంద్రబాబుల ఫొటోలతో వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రామానికి చెందిన ఆదివాసి గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి మాట్లాడుతూ తమ గ్రామం వెళ్లాలంటే పంచాయతీ కేంద్రం కోనాం నుంచి సుమారు 10 కిలోమీటర్లు మేర రెండు కొండలెక్కి చేరుకోవాలన్నారు. రోడ్డు సదుపాయం లేక పోవడంతో చిన్న పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే అవకాశం కూడా లేదన్నారు. ఎంపీపీ పాఠశాల లేకపోవడంతో పిల్లలు తల్లిదండ్రులతో పనులకు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది జనవరిలో తమకు రోడ్డు కావాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తే అధికారులు వచ్చి సర్వే చేసి చేతులు దులుపుకొన్నారన్నారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే డోలీ కట్టుకుని కొండ దిగి రావాల్సిందేనన్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి రెల్లలపాలెనికి రోడ్డు మంజూరు చేయాలన్నారు. గ్రామస్తులు కోట గంగమ్మ, దాయిరి దేముడమ్మ, కోట మల్లమ్మ, సోమల సూర్యనారాయణ, ఇరట ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల కొవ్వొత్తుల ర్యాలీ



నాలుగు రోడ్ల జంక్షన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు

అనకాపల్లి టౌన్: పాకిస్థాన్‌ని మూడు ముక్కలు చేసి మ్యాప్‌లో లేకుండా చేస్తామని అనకాపల్లి మాజీ సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అగ్గాల హనుమంతరావు తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ సోమవారం రాత్రి స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్‌లో 50 మంది మాజీ సైనికులు కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో డిఫెన్స్ వ్యవస్థ చాలా పటిష్టంగా ఉందన్నారు. యుద్ధం వస్తే పాక్ పుట్టగతులు లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో కొణతాల రత్నకుమారి, వై సోనీ, మంజుల, నారిపల్లి సత్యారావు, సందపర్తి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పహల్గామ్ బాధితులకు సంఘీభావ ర్యాలీ



జాతీయ జెండాలతో ఐక్యతా ర్యాలీ

నర్సీపట్నం: పహల్గాం ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన బాధిత కుటుంబాలకు మనోధైర్యాన్ని ఇస్తూ.. భారత సైనికులకు సంఘీభావంగా సోమవారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో లయన్స్, నవ్య లయన్స్, రోటరీ, వాసవీ క్లబ్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, పీఆర్టీయూ, ఏపీటీఎఫ్, యూటీఎఫ్, ఐఎంఏ, ప్రభుత్వ పింఛన్‌దారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, నింజాస్ అకాడమీ క్రీడాకారులు జాతీయ జెండాలు చేపట్టుకొని ర్యాలీ నిర్వహించారు. దేశ సమైక్యత వర్ధిల్లాలని, ఉగ్రవాదం నశించాలంటూ నినాదాలు చేశారు. స్టేడియం నుంచి శ్రీకన్య కూడలి వరకు ఈ ర్యాలీ సాగింది.

కొత్త భవనంలోకి సహకార బ్యాంకు మార్పు

నర్సీపట్నం: సహకార బ్యాంకును నర్సీపట్నం రామారావుపేటలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనంలోకి సోమవారం మార్చారు. బ్యాంకు ఖాతాదారులందరూ ఈ విషయాన్ని గమనించి ఎప్పటి వలే తమ వ్యాపార లావాదేవీలను జరిపి, బ్యాంకు అభివృద్ధికి తోడ్పాటునందించాలని బ్యాంకు డీజీఎం ఎం.శ్రీనివాసరావు కోరారు.

నలుగురు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులపై కేసు

యలమంచిలి రూరల్: డబ్బు కోసం కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్‌ను అడ్డగించి, డ్రైవర్ మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కొనిపోయిన నలుగురు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులపై కేసు నమోదు చేసినట్టు యలమంచిలి సీఐ ధనుంజయరావు తెలిపారు. సోమవారం రాత్రి తన కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. విశాఖ సిటీలోని ట్రూత్ న్యూస్ చానల్‌లో పనిచేస్తున్న చప్పా మోహన్ కృష్ణ, బంగారి భరత్, యండ్రపల్లి తిరుపతి, వానపల్లి శ్రీనివాసు ఆదివారం సాయంత్రం యలమంచిలి మండలం లైనుకొత్తూరు వద్ద వ్యాన్ డ్రైవర్‌ను బెదిరించిన విషయం తెలిసిందే. దీనిపై కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ఏ మల్లవరం గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ పోలపర్తి అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యలమంచిలి రూరల్ ఎస్సై ఎం ఉపేంద్ర కేసు నమోదు చేసినట్టు చెప్పారు. నిందితుల నుంచి మొబైల్ ఫోన్, ఐడీ కార్డులు, కారు స్వాధీనపర్చుకున్నట్టు చెప్పారు. మీడియా ముసుగులో బెదిరింపులకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో

మునగపాక: స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సోమవారం అనకాపల్లి ఆర్డీవో ఆయిషా సందర్శించారు. పూడిమడక రోడ్డు విస్తరణకు సంబంధించి చేపట్టనున్న పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతమయ్యేలా చూడాలని తహసీల్దార్ ఆదిమహేశ్వరరావుకు సూచించారు.

2 నుంచి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల ధర్నా



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవి ప్రసాద్

అనకాపల్లి టౌన్: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్‌తో మే 2వ తేదీ నుంచి ధర్నా కార్యక్రమాలు చేపడతామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవిప్రసాద్ తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా కనీస వేతనాలు లేక, ఉద్యోగ భద్రత వంటి సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయన్నారు. వీటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు, కోశాధికారి పీవీ శ్రీనివాసరావు, నరసింగరావు, శ్రీను, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలతో విజ్ఞానం పెంపు



చౌడువాడ గ్రంథాలయంలో సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు చేస్తున్న పద్మావతి, విద్యార్థులు



మాడుగుల శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కళావతి

కె.కోటపాడు : వేసవి శిక్షణ శిబిరాలతో విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంచుకోవచ్చునని చౌడువాడ శాఖా గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి అన్నారు. చౌడువాడ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవి చిత్రపటం వద్ద విద్యార్థులతో కలిసి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు నీతి కథలు బోధించారు. ఈ శిబిరాలను జూన్ 6వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు పద్మావతి తెలిపారు.

మాడుగుల: స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఎడ్ల కళావతి కోరారు. స్థానిక గ్రంథాలయాధికారి వై.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, ఆర్య వైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.



రోలుగుంట గ్రంథాలయంలో కథల పుస్తకాలు చదువుకుంటున్న విద్యార్థులు

మాడుగుల రూరల్: కె.జె.పురం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభమైంది. ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు విద్యార్థులుకు ఆటపాటలు, నీతి పుస్తకాలు చదివించడం చేస్తామని అటెండర్ వి. శృతి తెలిపారు.

రోలుగుంట: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయాధికారి వరలక్ష్మి ప్రారంభించారు. ఆట పాటలు, పుస్తక పఠనం, నీతి కథలు చెప్పుట, చెప్పించటం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఎంఈవో సిహెచ్.తలుపులు ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి పి.దమయంతి సమ్మర్ క్యాంపు ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు వ్యాయామ ఉపాధ్యాయులు పి.ప్రభాకర్, ఇంగ్లిష్, మ్యాథ్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, సుబ్బారావు పాల్గొన్నారు.

చీడికాడ: చీడికాడ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని సర్పంచ్ జి.సామాలమ్మ ప్రారంభించారు. మొదటి రోజు 20 మంది విద్యార్థులు పాల్గొని పుస్తక పఠనం చేసినట్లు గ్రంథాలయ అధికారి ఎం.జోగేశ్వరి తెలిపారు.

గొలుగొండ తహసీల్దార్‌పై విచారణ చేపట్టాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పాతమల్లంపేట గిరిజనులు

నర్సీపట్నం: భూ రికార్డులను మార్పు చేసిన గొలుగొండ తహసీల్దార్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాతమల్లంపేటకు చెందిన గిరిజనులు అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవిని కలిసి వాస్తవాలను వివరించారు. పాత మల్లంపేట వీఆర్వో గోవర్ధన్, ప్రస్తుత తహసీల్దార్ శ్రీనివాసరావు చట్ట విరుద్ధంగా రికార్డులు మార్చారని సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.జనార్దన్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. భూఆక్రమణపై ప్రత్యేక కమిటీ వేసి విచారణ జరిపించి గిరిజనులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. గిరిజనులపై ఎక్సైజ్ పోలీసులు అక్రమంగా కేసులు పెడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. జీలుగు కల్లు దొరికందనే పేరుతో ఆదివాసీలపై కేసులు పెట్టారని, సంప్రదాయ జీలుగు కల్లు సేకరించడం, అమ్ముకోవడం నేరం కాదని, ఒకవేళ కేసులు నమోదు చేయిస్తే వందలాది మంది గిరిజనుల జీవనోపాధి దెబ్బతింటుందని వివరించారు. బెల్టుషాపుల ద్వారా మద్యం ఏరులై పారుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని, సంప్రదాయ కళ్ళు అమ్ముకుంటున్న గిరిజనులను నర్సీపట్నం ఎక్సైజ్ పోలీసులు వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు.

గుడివాడలో జ్వరాల విజృంభణ



మాడుగుల సీహెచ్‌సీలో డెంగ్యూతో చికిత్స పొందుతున్న చిన్నారి శ్రీరామ్

చీడికాడ: మండలంలోని కోనాం శివారు గిరిజన గ్రామం గుడివాడలో మలేరియా, డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే గ్రామానికి చెందిన పలువురు జ్వరాలు బారిన పడి మాడుగుల సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఇద్దరు చిన్నారులు ఒనిపిరి శ్రీరామ్(5), సిహెచ్.రాజేశ్వరి(9) జ్వరాలతో చికిత్స పొందుతున్నారు. రాజేశ్వరికి ప్లేట్‌లెట్స్ కౌంట్ పడిపోవడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఆదివారం గ్రామానికి చెందిన కంటిముఖి శ్రీనుతో పాటు పలువురు డిశ్చార్జి అయ్యారని గ్రామపెద్ద సలుగు భీమునాయుడు తెలిపారు. ఇప్పటికైనా వైద్య సిబ్బంది స్పందించి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. జ్వర పీడితులు నిర్లక్ష్యం చేయకుండా ఆస్పత్రిలో చేరాలని మాడుగుల సీహెచ్‌సీ వైద్యుడు జి.నరేష్ కోరారు.

ఈదురుగాలులతో వర్షం



బుచ్చెయ్యపేట మండలం బీఎన్ రోడ్డులో చేరిన వర్షపు నీరు



రావికమతంలో పొలంలో చేరిన వర్షపు నీరు

రావికమతం: మండలంలో పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కురిసింది. ఉక్కపోతతో అల్లాడుతున్న జనానికి ఈ వర్షంతో ఊరటనిచ్చింది. ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించేందుకు ఈ వర్షాలు అనుకూలంగా ఉన్నాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

మాడుగుల రూరల్: వేసవి ఎండతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలుకు సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. ఉరుములు, మెరుపులుతో కూడిన వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 7 గంటలకు సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్దరించారు. ఈదురుగాలులకు మామిడి కాయలు నేలకొరిగాయి.

మాడుగుల: మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మామిడి, వరి పంటలకు నష్టం కలిగించాయి. రైతులు అకాల వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నా సరే ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన చెందుతున్నారు.

బుచ్చెయ్యపేట: మండలంలో ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. పెద్దపెద్ద పిడుగుల శబ్దానికి పొలాల్లో ఉన్న రైతులు ఆందోళన చెందారు. గాలి వర్షానికి పలు గ్రామాల్లో మామిడి కాయలు నేల రాలాయి. రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరింది. వాతావరణం ఒక్కసారే చల్లబడటంతో ప్రజలు సేద తీరారు. గాలి వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.